క్లుప్తంగా

సీఎంఆర్ఎఫ్ చెక్కు అందజేత

ఎమ్మెల్యే సునీతారెడ్డి



సీఎంఆర్ఎఫ్ చెక్కులను అందజేస్తున్న ఎమ్మెల్యే సునీతారెడ్డి

వెల్దుర్తి(తూప్రాన్): నిరుపేదలు మెరుగైన వైద్య సేవలు పొందడంలో సీఎంఆర్ఎఫ్ పథకం అండగా నిలుస్తుందని ఎమ్మెల్యే సునీతారెడ్డి అన్నారు. మండలంలోని మానెపల్లి, ఏదులపల్లి, వెల్దుర్తి, పెద్దాపూర్, మెల్లూర్ గ్రామాల్లోని పలువురు లబ్ధిదారులకు మంజూరైన సీఎంఆర్ఎఫ్ చెక్కులను శుక్రవారం హైదరాబాద్‌లోని తన కార్యాలయంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు భూపాల్‌రెడ్డికి అందజేశారు. కార్యక్రమంలో నాయకులు సత్యనారాయణగౌడ్, ప్రవీణ్, సుధాకర్‌లతో పాటు పలువురు పాల్గొన్నారు.

వన నర్సరీలో మొక్కలు సిద్ధం చేయాలి

ఏపీఓ పుణ్యదాస్

కౌడిపల్లి(నర్సాపూర్): వన మహోత్సవానికి గ్రామ వననర్సరీలలో మొక్కలను సిద్ధం చేయాలని ఏపీఓ పుణ్యదాస్ తెలిపారు. శుక్రవారం మండల కేంద్రమైన కౌడిపల్లిలోని వన నర్సరీని పరిశీలించారు. ఇక్కడ నర్సరీలో ఆరు వేల మొక్కలు పెంచుతున్నందున ప్రతి మొక్కను సంరక్షించి ఏపుగా పెరిగేలా చూడాలన్నారు. వనమహోత్సవం నాటికి అన్నిగ్రామాలలోని నర్సరీలలో మొక్కలు సిద్ధంగా ఉండాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి వెంకటేశం, టీఏ ప్రసాద్, కారోబార్ ఎల్లం తదితరులు పాల్గొన్నారు.

రంగంపేటలో ఉచిత వైద్య శిబిరం



ఉచితంగా మందులు అందజేస్తున్న దృశ్యం

కొల్చారం(నర్సాపూర్): మండలంలోని రంగంపేట గ్రామపంచాయతీ ఆవరణలో శుక్రవారం ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. మల్లారెడ్డి ఆస్పత్రి ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. రోగులకు పరీక్షలు నిర్వహించి ఉచిత మందులు అందజేశారు. కంటి ఇబ్బందులతో బాధపడుతున్న వారిని గుర్తించడంతోపాటు, శస్త్ర చికిత్స అవసరమైన వారిని రిఫర్ చేశారు. వీరికి ఆసుపత్రి ఆధ్వర్యంలో ఉచితంగా ఆపరేషన్ చేయడంతో పాటు అవసరమైన మందులు కంటి, అద్దాలు అందజేస్తామని ఆస్పత్రి మార్కెటింగ్ మేనేజర్ మహమూద్ తెలిపారు.ఈ కార్యక్రమంలో వైద్యులు కార్తీక్, తీర్థరాజ్, సిబ్బంది రజని, నందిని, పావని తదితరులు పాల్గొన్నారు.

పంచాయతీ కార్మికుల ముందస్తు అరెస్ట్

అల్లాదుర్గం(మెదక్): పంచాయతీ కార్మికులను అల్లాదుర్గంలో పోలీసులు ముందస్తు అరెస్టు చేశారు. చాలీచాలని వేతనాలతో విధులు నిర్వహిస్తున్న, సక్రమంగా వేతనాలు మంజూరు చేయకపోవడంతో తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నట్లు కార్మికులు ఆవేదన వ్యక్తం చేశారు. అరెస్ట్ అయిన వారికిలో వెంకటేశం, పాండు, సాయిలు తదితరులు ఉన్నారు.

నిజాంపేట(మెదక్): నిజాంపేట మండల కేంద్రంలో గ్రామ పంచాయతీ కార్మికులను పోలీసులు ముందస్తు అరెస్టు చేశారు. ఈ మేరకు శుక్రవారం గ్రామపంచాయతీ కార్మికుల సమస్యల కోసం హైదరాబాద్‌లోని అసెంబ్లీ ముట్టడి వెళుతున్న కార్మికులను ముందస్తు అరెస్టు చేశారు. కార్యక్రమంలో దేవుని రాజు, రాములు, ఏసు తదితరులు పాల్గొన్నారు.

వ్యవసాయ పద్ధతులపై శిక్షణ



రైతులకు వివరిస్తున్న శాస్త్రవేత్త మల్లేష్

ములుగు(గజ్వేల్): స్థానిక రైతువేదికలో అధికారులు ఉద్యాన పంటలు వ్యవసాయ పద్ధతులపై రైతులకు శుక్రవారం ఒక్కరోజు శిక్షణ నిర్వహించారు. జీడిమెట్ల సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్(సీఓఈ) ఆధ్వర్యంలో జరిగి ఈ కార్యక్రమంలో ఉద్యాన విశ్వవిద్యాలయ శాస్త్రవేత్త డా.మల్లేశ్ కూరగాయల సాగు, చేపట్టాల్సిన సస్యరక్షణ చర్యల గురించి వివరించారు. ములుగు వ్యవసాయ సంచాలకుడు అనిల్, వ్యవసాయ అధికారి ప్రగతి, జీడిమెట్ల ఉద్యానశాఖ అధికారులు జలంధర్, రమేశ్, వ్యవసాయ విస్తరణ అధికారి పృథ్వీరాజ్, వివిధ సంస్థల ప్రతినిధులు సుబ్బారావు, ప్రసాద్ పాల్గొన్నారు.

పెట్టుబడి తక్కువ.. రాబడి ఎక్కువ

- ఈ సూచనలు, సలహాలు పాటించండి
- సీనియర్ శాస్త్రవేత్తలు శోభారాణి, ఉదయ్ కుమార్
- రుస్తుంపేటలో యాంత్రీకరణ వ్యవసాయంపై రైతులకు అవగాహన



రైతులకు అవగాహన కల్పిస్తున్న అధికారులు

నర్సాపూర్ రూరల్: తక్కువ పెట్టుబడితో ఎక్కువ రాబడి సాధించాలని సత్నయ్యపల్లిలోని ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ పరిశోధన స్థానం సీనియర్ శాస్త్రవేత్త శోభారాణి, తుంకిలోని కృషి విజ్ఞాన కేంద్రం సీనియర్ శాస్త్రవేత్త ఉదయ్ కుమారు సూచించారు. శుక్రవారం నర్సాపూర్ మండలం రుస్తుంపేటలో నర్సాపూర్ వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో యాంత్రీకరణ వ్యవసాయంపై రైతులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. కూలీల కొరతను దృష్టిలో పెట్టుకొని ప్రతి రైతు యాంత్రీకరణతో వ్యవసాయం చేస్తే తక్కువ పెట్టుబడితో ఎక్కువ రాబడి సాధించవచ్చని చెప్పారు. రైతులు పంటలు సాగు చేసే ముందు విత్తన కొనుగోలుపై తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. విత్తనాలు కొన్ని ముందు రశీదు తీసుకోవడంతో పాటు నాణ్యత ప్రమాణాలు పరిశీలించుకోవాలని సూచించారు. ప్రస్తుత వర్షాకాలంలో వరి సాగు కోసం నారుమడి, మొదలుకొని పంట కోతకు వచ్చే వరకు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, ఆయా రకాల మెలకువలను వివరించారు. రసాయన ఎరువుల వాడకాన్ని తగ్గించి సేంద్రియ ఎరువులతో పంటలు సాగు చేయాలని సూచించారు. ప్రతి రైతు కేంద్ర ప్రభుత్వం వ్యవసాయం కోసం ప్రవేశపెట్టిన పథకాలను అంది పుచ్చుకునేందుకు ఏఈఓల వద్ద పట్టా పాస్ బుక్, ఆధార్ కార్డు, ఫోన్ నంబర్లను అందజేసి రిజిస్ట్రేషన్ చేసుకోవాలని తెలిపారు. రిజిస్ట్రేషన్ చేయించి విశిష్ట సంఖ్య పొందాలని తెలిపారు. అనంతరం రుస్తుంపేటకు చెందిన బేకరీ యాదయ్యకు చెందిన పొలంలో డ్రమ్ సీడర్‌తో వరి విత్తడంపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో నర్సాపూర్ డివిజన్ ఇన్‌చార్జి ఏడీ గంగమల్లు, ఏఓ దీపిక, రైతులు పాల్గొన్నారు.

అన్ని శాఖల్లో వర్గీకరణ అమలు చేయాలి

ఎమ్మార్పీఎస్ జిల్లా ఇన్‌చార్జి బొజ్జ సైదులు



మాట్లాడుతున్న ఎమ్మార్పీఎస్ నాయకులు

మెదక్ మున్సిపాలిటీ: ఎస్సీ వర్గీకరణ ప్రకారమే కుల ధృవీకరణ పత్రాలు అందజేయాలని, అన్ని శాఖల్లో వర్గీకరణ అమలు చేయాలని ఎమ్మార్పీఎస్ జిల్లా ఇన్‌చార్జి బొజ్జ సైదులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం మెదక్ జిల్లా కేంద్రంలో ఎమ్మార్పీఎస్ జిల్లాస్థాయి సమావేశం జరిగింది. ఈ సందర్భంగా సైదులు మాట్లాడుతూ రాష్ట్రం ప్రభుత్వం తీసుకొచ్చిన ఎస్సీ వర్గీకరణ చట్టంలో పేర్కొన్న విధంగా గ్రూప్ -1, గ్రూప్-2 , గ్రూప్- 3 ప్రకారం కుల ధృవీకరణ పత్రాలు ఇవ్వాలన్నారు. అనంతరం చెట్లపల్లి యాదగిరి, అస్తగల్ల బాల్‌రాజ్, మల్లిశెట్టి రవిలు మాట్లాడుతూ ఎస్సీ వర్గీకరణలో అన్ని శాఖల్లో రాష్ట్ర ప్రభుత్వం పకడ్బందీగా అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఎమ్మార్పీఎస్ ఉద్యమ మొదలైన తరువాతనే మాదిగ జాతికి గుర్తింపు గౌరవం లభించిందన్నారు. ఎస్సీ వర్గీకరణ విజయం తరువాత జరుగుతున్న ఎమ్మార్పీఎస్ 31వ ఆవిర్భావ దినోత్సవం జూలై 7న ఘనంగా నిర్వహించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లాలోని ఎమ్మార్పీఎస్ నాయకులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

ఎస్పీని సన్మానించిన పీఆర్టీయూ నేతలు



ఎస్పీని సన్మానిస్తున్న పీఆర్టీయూ నాయకులు

మెదక్ మున్సిపాలిటీ: పీఆర్టీయూ జిల్లా శాఖ ఆధ్వర్యంలో శుక్రవారం జిల్లా ఎస్పీ డీవీ శ్రీనివాసరావును మర్యాదపూర్వకంగా కలిశారు. పోలీసు ప్రధాన కార్యాలయంలో ఆయనను కలిసి ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ.. మా నాన్న కూడా ఉపాధ్యాయుడు అని.. తాను ప్రభుత్వ పాఠశాలలోనే చదివానని తెలిపారు. ప్రభుత్వ పాఠశాలలో మెరుగైన విద్యను అందించి విద్యార్థులను ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దాలని ఆకాంక్షించారు. ఈ విద్యా సంవత్సరం మన జిల్లాలో మెరుగైన ఫలితాలు రావడంతో శుభాకాంక్షలు తెలిపారు. ప్రభుత్వం చేపట్టిన ఈగిల్ ప్రోగ్రాంకు ఉపాధ్యాయుల సహకారం ఉండాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు సుంకరి కృష్ణ, ప్రధాన కార్యదర్శి సామ్య నాయక్ తదితరులు పాల్గొన్నారు.

నిబంధనల మేరకు ఇళ్లు నిర్మించాలి



తంప్లూర్‌లో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి భూమి పూజ చేస్తున్న నాయకులు



ఇళ్ల నిర్మాణానికి కొబ్బరికాయ కొడుతున్న మల్లేశం గౌడ్

టేక్మాల్ (మెదక్): నిరుపేద ప్రజలకు అండగా నిలిచేందుకే కాంగ్రెస్ ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేస్తుందని మాజీ జెడ్పీటీసీ సర్పని సరోజ తెలిపారు. టేక్మాల్ మండల పరిధిలోని తంప్లూర్‌లో శుక్రవారం ఇందిరమ్మ ఇళ్లకు ఏఈ కౌశిక్‌తో కలిసి ముగ్గు పోసి భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రభుత్వం నిర్ణయించిన నిబంధనల మేరకు ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలు చేపట్టాలన్నారు. కాంగ్రెస్ నాయకులు నారాయణ, నాగయ్య,చిన్న మల్లేశం, భూమయ్య, రవి, గోష్కెల్లయ్య, కోట భూమయ్య, ఇందిరమ్మ కమిటీ సభ్యులు రాణి ,పంచాయతీ కార్యదర్శి పోచయ్య, లక్ష్మణ్, సతీష్ తదితరులు పాల్గొన్నారు.

మంజూరు పత్రాల అందజేత

చిన్నశంకరంపేట(మెదక్): నార్సింగి మండల కేంద్రంలో పలువురు ఇందిరమ్మ లబ్ధిదారులకు మంజూరు ధ్రువపత్రాలను మండల కాంగ్రెస్ నాయకులు రాజేష్ అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. త్వరలోనే అర్హులైన పేదలకు ఇళ్ల స్థలాలను అందిస్తామన్నారు. కార్యక్రమంలో నార్సింగి ఈఓ నాగభూషణం పాల్గొన్నారు.

రేగోడ్ మండలంలో..

రేగోడ్(మెదక్): రాష్ట్ర ప్రభుత్వం మంజూరు చేస్తున్న ఇందిరమ్మ ఇండ్లు పేదలకు వరమని మాజీ సర్పంచ్ ఎం.విజయభాస్కర్, పీఏసీఎస్ డైరెక్టర్ నాగేందర్‌రావు కులకర్ణి అన్నారు. మండల కేంద్రమైన రేగోడ్‌లో శుక్రవారం ఇళ్లకు భూమి పూజ చేశారు. కార్యక్రమంలో గ్రామ పంచాయతీ కార్యదర్శి అరుణ్, కాంగ్రెస్ పార్టీ మండల ఉపాధ్యక్షుడు మల్లికార్జున్, గ్రామ అధ్యక్షుడు శంకరప్ప, నాయకులు రామాగౌడ్, కృష్ణ, తుల్జారాంగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి భూమి పూజ

కొల్చారం(నర్సాపూర్): ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం ద్వారా పేదల సొంతింటి కల సాకారమవుతుందని మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మల్లేశం గౌడ్ పేర్కొన్నారు. శుక్రవారం రంగంపేటలో ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల ఇంటి నిర్మాణానికి ముగ్గు పోసి, కొబ్బరికాయ కొట్టారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి రాజు, ఫీల్డ్ అసిస్టెంట్ పోచయ్య ,గ్రామ పార్టీ అధ్యక్షుడు కృష్ణ,నాయకులు వెంకట్‌గౌడ్, దుర్గేష్‌గౌడ్, సాయిగౌడ్, శివరాములు, యాదగిరి పాల్గొన్నారు.

నక్షబాట పునరుద్ధరణ పూర్తి

శివ్వంపేట(నర్సాపూర్): ఆక్రమించిన నక్షబాట పునరుద్ధరణ పూర్తి కావడం పట్ల రైతులు శుక్రవారం సంతోషం వ్యక్తం చేశారు. మండల పరిధి కొంతన్‌పల్లి గ్రామ పంచాయతీ పరిధిలో పలు వ్యవసాయ పొలాలకు, కరీంకుంటకు సంబంధించిన నక్షబాటను ఆక్రమార్కులు కబ్జా చేసి పలు కట్టడాలు చేయడంతో గ్రామస్తులు ఉన్నతాధికారులకు ఫిర్యాదు తో 20 రోజుల క్రితం రెవెన్యూ సిబ్బంది సర్వే చేసి నక్షబాటకు సంబంధించి హద్దులు ఏర్పాటు చేశారు. సుమారు రెండు కిలోమీటర్ల నక్షబాటకు రైతులు స్వచ్ఛందంగా ముందుకు వచ్చి 20 ఫీట్ల వెడల్పుతో మట్టి రోడ్డుని చదును చేశారు. నక్షబాట పునరుద్ధరిండం పట్ల రెవెన్యూ సిబ్బందికి మాజీ సర్పంచ్ శ్రీనివాస్‌గౌడ్, దేవలింగం, మాజీ ఎంపీటీసీ శ్రీనివాస్, రైతులు శివకుమార్, సంతోష్, అనంద్, రాము కృతజ్ఞతలు తెలిపారు.

తాగునీటికి కటకట

మనోహరాబాద్(తూప్రాన్): మండల కేంద్రమైన మనోహరాబాద్, కోనాయపల్లి(పీటి), రామాయపల్లి, కోండాపూర్, కాళ్లకల్ తదితర గ్రామాలలో నాలుగైదు రోజులుగా మిషన్ భగీరథ నీరు సరఫరా జరగకపోవడంతో గ్రామస్తులకు ఇబ్బందులు తప్పడం లేదు. మనోహరాబాద్‌లో పలు వీధులలో ట్యాంకర్ల ద్వారా నీటిని తెచ్చుకుంటున్నారని, రామాయపల్లి, కోనాయపల్లి(పీటి) గ్రామాలలో పొలాల నుంచి తెచ్చుకుంటున్నామని వాపోతున్నారు. ఈ విషయమై అధికారులను సంప్రదిస్తే మిషన్ భగీరథ పైప్‌లైన్ సమస్య కారణంగా నీరు సరిగ్గ రావడంలేదని, రెండు రోజులలో సమస్య పరిష్కరిస్తామని తెలిపారు.

వీవో ఆత్మహత్యకు కారకులను శిక్షించాలి

రెడ్డి సంఘం జిల్లా అధ్యక్షుడు రాజేందర్‌రెడ్డి

పాపన్నపేట(మెదక్): వీవో పద్మ ఆత్మహత్యకు కారకులైనవారిని కఠినంగా శిక్షించాలని రెడ్డి సంఘం జిల్లా అధ్యక్షుడు రాజేందర్‌రెడ్డి డిమాండ్ చేశారు. శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఆమె అమాయకత్వాన్ని ఆసరాగా తీసుకొని వేధింపుల పాల్జేసిన బ్యాంక్ అధికారులు ఏపీవో, ఇతర అధికారులపై చర్యలు తీసుకోవాలన్నారు. ఈ విషయమై కలెక్టర్ సమగ్ర విచారణ జరిపించి చర్యలు తీసుకోవాలని ఆయన విజ్ఞప్తి చేశారు.ఆధారాలు బయట పడకుండా కొందరు పథకం ప్రకారం రూ.లక్షలు కాజేశారని ఆయన ఆరోపించారు.

ఉచిత డ్రైవింగ్ శిక్షణ

చిన్నకోడూరు(సిద్దిపేట): స్థానిక కేఆర్ఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత డ్రైవింగ్ శిక్షణ కేంద్రాన్ని ఫౌండేషన్ చైర్మన్ వంశీధర్‌రావు శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యువతీ, యువకులకు ఉచితంగా డ్రైవింగ్ శిక్షణ ఇచ్చి లైసెన్స్ అందజేస్తామన్నారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు అబ్బిరెడ్డి, ఫౌండేషన్ సభ్యులు, యువత పాల్గొన్నారు.

నీరు నిలువ లేకుండా చూసుకోవాలి

డ్రై డే నిర్వహించిన వైద్య సిబ్బంది



నీటి తొట్లలో నీటిని శుభ్రం చేయిస్తున్న వైద్యసిబ్బంది

కౌడిపల్లి(నర్సాపూర్): వినియోగంలోలేని నీటితొట్లలో నీరు నిల్వ లేకుండా చూసుకోవాలని తండావాసులకు వైద్యసిబ్బంది సూచించారు. శుక్రవారం మండల కేంద్రమైన కౌడిపల్లి బతుకమ్మతండాలో డ్రై డే కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా నీటి తొట్లు, టైర్లు, కొబ్బరి బోండాలు, పాతడబ్బాలలో నిలువ ఉన్న నీటిని తొలగించారు. వర్షాకాలం సందర్భంగా నీరు నిల్వ ఉండటంతో దోమలు పెరిగి మలేరియా, డెంగ్యూ ఇతర విషజ్వరాలు ప్రబలే అవకాశం ఉంటుందని, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఏఎన్ఎంలు శ్రీధర్‌రెడ్డి, శిరోమణి, పంచాయతీ కార్యదర్శి వెంకటేశం, ఆశవర్కర్ చెన్నమ్మ తండావాసులు పాల్గొన్నారు.

ప్రభుత్వ ధర ప్రకారం భూములు కొంటాం

రైతుల స్పష్టీకరణ



రైతులతో మాట్లాడుతున్న ఆర్డీఓ మైపాల్‌రెడ్డి

శివ్వంపేట(నర్సాపూర్): తాత, ముత్తాతల కాలం నుంచి నమ్ముకొని సాగు చేసుకుంటున్న భూములకు ప్రభుత్వ ధర ప్రకారం చెల్లించి కొనుగోలు చేస్తామని కౌలు మాత్రం చెల్లించమని రైతులు తెగేసి చెప్పారు. మండల పరిధిలోని దొంతి గ్రామ పరిధిలో సర్వేనంబర్ 78, 79, 98 నుంచి 136 వరకు ఉన్న 242 ఎకరాలకు సంబంధించి భూములను గ్రామానికి చెందిన 130 మంది రైతులు సాగు చేసుకుంటున్నారు. రైతులు సాగు చేసుకుంటున్న భూములు దేవాదాయ శాఖకు సంబంధించినందున కౌలు (శిస్తు) చెల్లించాలని పలుమార్లు సిబ్బంది రైతులకు విన్నవించారు. శుక్రవారం ఇట్టి భూములు కాస్తు చేస్తున్న రైతులతో నర్సాపూర్ ఆర్డీఓ మైపాల్‌రెడ్డి దొంతిలోని రైతువేదికలో సమావేశం నిర్వహించారు. భూమి లేని చిన్న, సన్నకారు రైతులు ఇట్టి భూములను సాగు చేసుకుంటూ జీవనోపాధి పొందుతున్నామని కౌలు మాత్రం చెల్లించమని ప్రభుత్వ ధర ప్రకారం డబ్బులు చెల్లిస్తామని మా పేరిట పట్టాలు ఇవ్వాలని రైతులు కుమార్, మోహన్‌గౌడ్, రాహుల్, చంద్రం, సత్యనారాయణ, తదితరులు అన్నారు. ఈ విషయంపై ఉన్నతాధికారులకు నివేదిస్తానన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ కమలాద్రి, ఆర్ఐ కిషన్, తదితరులు ఉన్నారు.

మధ్యాహ్న భోజన పథకాన్ని అమలు చేయాలి



నిరసన తెలుపుతున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

మెదక్ కలెక్టరేట్: జిల్లాలోని అన్ని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మధ్యాహ్న భోజన పథకాన్ని అమలు చేయాలని ఎస్ఎఫ్ఐ జిల్లా కమిటీ సభ్యుడు అజయ్‌కుమార్ డిమాండ్ చేశారు. శుక్రవారం మెదక్ ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాలలో ఈ మేరకు నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా అజయ్ కుమార్ మాట్లాడుతూ ప్రభుత్వ కళాశాలలకు వచ్చేది 90శాతం పేద విద్యార్థులే కాబట్టి జిల్లాలోని అన్ని ప్రభుత్వ కళాశాలలో పథకాన్ని అమలు చేయాలని డిమాండ్ చేశారు. గ్రామాల నుంచి వచ్చే ఎంతో మంది విద్యార్థులు బస్సులు, ఆటోలు కళాశాలల సమయానికి రాక పోవడంతో టిఫిన్ బాక్స్‌లు తెచ్చుకోలేక పోతున్నారు. దీంతో మధ్యాహ్నం వేళ విద్యార్థులంతా ఆర్థాకలితో అలమటిస్తున్నట్లు ఆవేదన వ్యక్తం చేశారు. ఫలితంగా చదువుపై ధ్యాస పెట్టలేక అనేక అవస్థలు పడుతున్నారని, వెంటనే ప్రభుత్వం స్పందించి మధ్యాహ్న భోజన పథకాన్ని అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ పట్టణ నాయకులు నాని, సంతోష్, ప్రవీణ్, చరణ్, వరుణ్, గణేష్ పాల్గొన్నారు.

ప్రభుత్వ భూమిని కబ్జా నుంచి కాపాడాలి

వెల్మకన్న మాజీ సర్పంచ్ రాజేందర్ ఫిర్యాదు

కౌడిపల్లి(నర్సాపూర్): మండలంలోని వెల్మకన్నలో సర్వేనంబర్ 447లో కబ్జాకు గురవుతున్న ప్రభుత్వ భూమిని కాపాడాలని మాజీ సర్పంచ్ కాజీపేట రాజేందర్ హైదరాబాద్‌లోని సీసీఎల్ఏ (చీఫ్ కమిషనర్ ఆఫ్ ల్యాండ్ అడ్మినిస్ట్రేషన్) కార్యాలయంలో శుక్రవారం ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామశివారులోని ప్రభుత్వ భూమిలో కొందరు పట్టాలు పొంది భూమిని కబ్జా చేస్తున్నారని ఆరోపించారు. ఈ విషయమై స్థానిక రెవెన్యూ అధికారులకు ఎన్నిసార్లు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని విమర్శించారు. దీంతో సీసీఎల్ఏలో ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. సర్వేనంబర్ 447లోని భూమిని కబ్జా నుంచి కాపాడి ఇళ్లలేని నిరుపేదలకు ఇంటి స్థలాలు ఇవ్వాలని లేక పోతే కౌడిపల్లిలోని డిగ్రీ కళాశాలకు స్థలం కేటాయించాలని కోరారు.

చెరువులో నుండి ప్లాస్టిక్ వ్యర్థాల తొలగింపు


సాక్షి ఎఫెక్ట్..

కొల్చారం(నర్సాపూర్): మండలంలోని చెరువులు, కుంటల్లో ప్లాస్టిక్ వ్యర్థాలను పారపోయడం ద్వారా ఎదురయ్యే ఇబ్బందులపై సాక్షి దిన పత్రికలో ఈనెల 25న ప్లాస్టిక్ వ్యర్థాలు.. పర్యావరణానికి తూట్లుఅన్న వార్త ప్రచురితమైన విషయం తెలిసింది. దీనిపై స్పందించిన మండలంలోని సంగాయిపేట గ్రామపంచాయతీ సిబ్బంది గ్రామంలోని పెద్ద చెరువులోని ప్లాస్టిక్ వ్యర్థాలను తొలగించే పనులను శుక్రవారం చేపట్టారు. దీంతో మత్స్యకారులు హర్షం వ్యక్తం చేశారు.



చెరువులో ప్లాస్టిక్ వ్యర్థాలను తొలగిస్తున్న దృశ్యం

పంచాయతీ కార్మికుల అరెస్టు



పోలీసుల అదుపులో పంచాయతీ కార్మికులు

తూప్రాన్: పంచాయతీరాజ్ కార్మికులను పోలీసులు ముందస్తు అరెస్టు చేశారు. తమ డిమాండ్ల సాధన కోసం హైదరాబాద్‌లోని పంచాయతీ రాజ్ కమిషనర్ కార్యాలయం వద్ద ధర్నాకు వెళ్తున్న కార్మికులను శుక్రవారం పోలీసులు ముందస్తుగా అరెస్టు చేశారు. ఈ సందర్భం కార్మికులు మాట్లాడుతూ కొన్నాళ్లుగా ప్రభుత్వం పెండింగ్ బిల్లులు చెల్లించడం లేదని ఆరోపించారు. ఈ క్రమంలోనే శాంతియుతంగా తమ సమస్యల సాధన కోసం హైదరాబాద్‌లో తలపెట్టిన ధర్నాకు తరలివేళ్లేందుకు సిద్ధం అవుతున్న తరుణంలో ముందస్తుగా పోలీసులు తమను అరెస్టు చేసి పోలీస్‌స్టేషన్‌కు తరలించినట్లు తెలిపారు. పెండింగ్ బిల్లులను వెంటనే మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళనలు చేపడుతామని హెచ్చరించారు.

సంక్షిప్త వార్తలు

◆ అక్రమ అరెస్టులు సరికాదు

మనోహరాబాద్(తూప్రాన్): గ్రామ పంచాయతీ కార్మికులను వేతనాల కోసం పోరాడుతుంటే వారి అక్రమ అరెస్టులు సరికాదని జిల్లా పంచాయతీ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి ఆసిఫ్ అన్నారు. శుక్రవారం పంచాయతీ కార్మికులు చలో హైదరాబాద్ ఉన్న నేపథ్యంలో పలు గ్రామాలకు చెందిన వారిని పోలీసులు ముందస్తు అరెస్టు చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గ్రామ పంచాయతీ కార్మికులు వారి సమస్యలు, వేతనాల కోసం పోరాటం చేస్తుంటే ప్రభుత్వం పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా ప్రభుత్వం దృష్టి సారించి కనీస వేతనాలు, సమస్యలు పరిష్కరించాలని కోరారు. అరెస్ట్ చేసిన వారిలో మండల అధ్యక్షులు శ్రీకాంత్, ఉపాధ్యక్షులు స్వామి తదితరులున్నారు.

◆ అన్ని వర్గాలకు ప్రభుత్వ పథకాలు

శివ్వంపేట(నర్సాపూర్): అన్ని వర్గాలకు ప్రభుత్వ పథకాలు అమలు చేస్తామని నర్సాపూర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి ఆవుల రాజిరెడ్డి అన్నారు. శుక్రవారం మండల పరిధిలోని పిల్లుట్లలో ఇందిరమ్మ ఇంటి నిర్మాణాలకు భూమి పూజ చేశారు. గత ప్రభుత్వం చేయని అభివృద్ధి పనులు ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తుందన్నారు. కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ వెంకట్‌రామిరెడ్డి, సీనియర్ నాయకులు మాధవరెడ్డి, నవీన్‌గుప్తా, వేణుగోపాల్‌రెడ్డి, కమలపూల్‌సింగ్, గణేష్, అరుణ్‌కుమార్, శంకర్, శ్రీధర్‌గౌడ్, ఉన్నారు.

◆ ప్రతి రైతుకు యూనిక్ ఐడీ కార్డు

చిలప్‌చెడ్(నర్సాపూర్): ప్రతి రైతు యూనిక్ ఐడీ కోసం దరఖాస్తు చేసుకోవాలని మండల వ్యవసాయాధికారి రాజశేఖర్ గౌడ్ అన్నారు. శుక్రవారం ఆయన చిలప్‌చెడ్ రైతు వేదికలో యూనిక్ ఐడీ రిజిస్ట్రేషన్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి వ్యక్తికి ఆధార్ ఉన్నట్టే, భూమి ఉన్న ప్రతి రైతుకు 11 నెంబర్ల విశిష్ట సంఖ్య అవసరమన్నారు. ఈ రిజిస్ట్రేషన్‌కు ఆధార్ కార్డు, భూ యాజమాని పట్టా పాస్‌బుక్కు, ఆధార్‌తో లింక్ ఉన్న మొబైల్ తీసుకుని వ్యవసాయాధికారులను సంప్రదించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏఈఓ అనిత, రైతులు పాల్గొన్నారు.

◆ ప్రభుత్వం గద్దె దిగిపోవడం ఖాయం

శివ్వంపేట(నర్సాపూర్): ప్రజా వ్యతిరేక విధానాలు అవలంబిస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వం గద్దె దిగిపోవడం ఖాయమని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు మహేందర్‌రెడ్డి అన్నారు. శుక్రవారం గ్రామ పంచాయతీ కార్మికులను ముందస్తు అరెస్టు చేసి పోలీస్టేషన్‌కు తరలించడం పట్ల ఆయన తీవ్రంగా ఖండించారు. ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు.

◆ రాజిరెడ్డిని విమర్శిస్తే సహించం

కౌడిపల్లి(నర్సాపూర్): కాంగ్రెస్‌పార్టీ నర్సాపూర్ నియోజకవర్గ ఇన్‌చార్జి ఆవుల రాజిరెడ్డిని విమర్శిస్తే బీఆర్ఎస్ నాయకుల ఇళ్లను ముట్టడిస్తామని మండల కాంగ్రెస్ నాయకులు హెచ్చరించారు. శుక్రవారం ధర్మాసాగర్ గేట్ వద్ద మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు శ్రీనివాసరావ్, డీసీసీ ప్రధాన కార్యదర్శి సయ్యద్‌పాష తదితరులు విలేకరులతో మాట్లాడుతూ ఇచ్చిన హామీ మేరకు కాంగ్రెస్ ప్రభుత్వం అన్ని గ్రామాలలో ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేస్తుందని, ఇది జీర్ణించుకోలేక బీఆర్ఎస్ నాయకులు ఇష్టానుసారంగా మాట్లాడుతున్నారని విమర్శించారు. కార్యక్రమంలో నాయకులు కొర్ర శ్రీను, ప్రవీణ్‌రెడ్డి, శ్రీనివాస్‌గౌడ్, అశోక్, వీరేష్‌గౌడ్, బాలాగౌడ్, లక్ష్మణ్‌రాజు, రామాంజనేయులు, పర్వతాలు పాల్గొన్నారు.

◆ సీజనల్ వ్యాధులపై అప్రమత్తం

గజ్వేల్‌రూరల్: వర్షాకాలం ప్రారంభమైందని, ప్రజలు సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని గజ్వేల్ సబ్‌యూనిట్ అధికారి శ్రీనివాస్ సూచించారు. పీహెచ్‌సీ పరిధిలోని రిమ్మనగూడలో శుక్రవారం డ్రైడే ఫ్రైడే కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వర్షాకాలంలో డెంగీ, చికున్ గునియా, మలేరియా, ఫైలేరియా లాంటి విషజ్వరాలు వచ్చే ఆస్కారముందని, ముందు జాగ్రత్తతోనే వ్యాధులు ప్రబలకుండా నియంత్రించవచ్చన్నారు. నీటిని వేడి చేసుకొని తాగాలని, బయట లభించే ఆహార పదార్థాలను తీసుకోవద్దని సూచించారు. పంచాయతీ కార్యదర్శి రామకృష్ణ, వైద్య సిబ్బంది ప్రేమ్‌చందర్, వాసుదేవ్, దుర్గాగౌడ్, మంజుల, ఆశా కార్యకర్తలు హేమలత, దర్గమ్మ పాల్గొన్నారు.

గురువన్నపేటలో..

కొమురవెల్లి(సిద్దిపేట): మండలంలోని గురువన్నపేటలో పంచాయతీ కార్యదర్శి కరుణాకర్ ఆధ్వర్యంలో డ్రైడే నిర్వహించారు. నీటి ట్యాంకులలో నిల్వ ఉన్న నీటిని ఖాళీ చేయించారు. సీజనల్ వ్యాధులపై గ్రామస్తులకు అవగాహన కల్పించారు.